# కడెతి వేట

ఫాల్గుణ శుద్ధ ద్వాదశి

అహోబిళ నరసింహస్వామి తిరునాళ్లు జోరుగా సాగుతున్నాయి.

నల్లమల కొండలు స్వామి పవిత్రనామాలతో ప్రతిధ్వనిస్తున్నాయి. సగలేటి దరిదాపుల పల్లెల్లోని జనం గుంపులు గుంపులుగా బయల్దేరి వరికుంట్ల మీదుగా కొండల్లోకి నడిచారు. చెలిమ బావిలోనో, జ్యోతిక్షేత్రం వద్దో నీళ్లు తాగి గరుడాద్రిదాకా నడిచి రాత్రి ఆ కొండమీద విడిది చేయాలని కొందరి ఆలోచన. ఇంకొందరు జ్యోతిలోని కాశినాయన ఆశ్రమం వద్ద గడపాలని నిర్ణయం. అందరూ ఉదయం పదిగంటలకల్లా పాములేటి మీదుగా ఎగువ అహోబిళం చేరుకోవాలి.

"అంబలి పొద్దుకే ఎండలు సురక్కి సురక్కిమని కాలుస్పాండయి. అబ్బబ్బ.... పైటేలకు తట్టుకుంటామా?"

"దానికి తోడు ఉక్కబోత.. కొండల్లోనే ఇట్లుంటే బరకల్లో ఎంతలావు సెగ వుంటదో!"

"అబ్బా.. ఏమి ఎండలు ... ఏమెండలు!"

సుద్దబోడు ఎనుపున చెట్ల సందుల్లో ఎగుడు ఇరుకు దారెంట ఒకరి వెనుక మరొకరు నడుస్తున్నారు పదిమందిదాకా జనం.

అందరి భుజాల మీదా చిన్నచిన్న మూటలు వేలాడుతున్నాయి - పచ్చివెదురు కర్రకో, గొడ్డలికో తగిలించబడి.

ఎండ తాపాన్నీ నడక భారాన్నీ మరవటానికి ఏవేవో కబుర్లు చెప్పుకొంటున్నారు. తమ అనుభవాల్లోని హుషారు సంఘటనల్ని విప్పుతున్నారు.

సెవ్వన్న పాట ఎత్తుకొన్నాడు.

"గుట్ట గుట్టా దిరగలేనూ గూనిమేకలు కాయలేనూ
పచ్చిపాలూ తాగలేనూ పాయందాన్నీ పట్టలేనూ
చింతమానీ కొమ్మమీందా చిగురుబెరికే సిన్నదానా
ఎత్తుకుండే ఎర్రగాలీ ఎగిరిపోయే పైటకొంగూ...

పాట అందం గుండెల్లో కోలన్న వేసింది.

రాముడయితే కులుకుడు భజన అడుగులు తొక్కుతూ నడుస్తున్నాడు.

"బాగా పాడినవురా అబ్బీ! పాట బో కుశాలగా వుందిరా!" సెవ్వన్న పక్కగా నడుస్తోన్న ముసలి గురప్ప మెచ్చుకొన్నాడు.

బోడు మీంచి సెలలోకి దిగారు.

ఎండిపోయి నిర్జీవంగా పడివున్న వంక కడుపునిండా గుండ్రాళ్లతో ఎదురైంది వాళ్లకు.

వంక దరులమీద దట్టంగా పెరిగివున్న చెట్ల కొమ్మల్లోంచి పక్షుల కిలకిలా రావాలు చెవులకింపుగా విన్పిస్తున్నాయి.

ఒక్కసారి అట్లా నిలబడి చుట్టూ చూశాడు సెవ్వన్న.

పాట ఆపి మరీ తన్మయంగా చూశాడు.

"నా పాటకన్నా పెదనాయినా! యీ అడివే బాగుంది" అన్నాడు.

"ఇదేం అడివిరా.. పాతికేండ్ల కిందగీన నువ్వు సూసింటేనా.. సెట్ల చిటారు కొమ్మలు నూడాలంటే తలగుడ్డ నేలబడాల్సుందేననుకో. తొలగ దొయ్యను సందున్నెదా? టేకు సందనం యినుమద్ది ఋట్టేగి.. అబ్బో..."

"అట్లనా! ఏమైపోయెమరి ఆ సెట్లన్నీ?"

"ఏమైతయి.. నరికి అమ్ముకున్నెరు.. సెట్లను రూపాయిల్జేసి ముల్లెగట్టుకొన్నెరు..."

"గార్డు, రైంజరు, ... ఫారెస్టోల్లు కావిలుంటారేమోనే?"

"వాళ్లే... వాళ్లే లెక్కకు గడ్డిదిని అమ్ముకుంటాంటే..." తరతరాల అశక్తతతో కూడిన చిరాకు ఒకటి మాటను మింగేసింది.

సెవ్వన్నకు కూడా బాధ కలిగింది. బస్సుల్లో వస్తానో పోతానో చూసిన వాడేగాని ఇట్లా ప్రత్యక్షంగా ఎప్పుడూ అడవుల్లోకి వచ్చినవాడు కాదు అతను. అడవులకు దూరంగా విస్తారమైన మెట్టభూముల పల్లెలవాడు.

"నాగేలిదుంప తెచ్చుకొంటే ఎంటబడి పట్టుకొని కేసు బెద్తారు. లారీల్లారీలకు ఎర్రసందనం తోలకపోతాండే ఎగమల్లి గూడా సూడరు... ఏం పారెస్టోల్లు తీ.." గురప్ప ఈసడించుకొన్నాడు.

సెవ్వన్నకు కోపమొచ్చింది.

"నడీదిలో నిలబెట్టి గుడ్డలుప్పదీసి కొట్టాల నాకొడకల్ను.." చెట్లనరికే వాళ్లనూ, ఫారెస్ట్ గార్డ్‌లను ఉద్దేశించి తిట్టాడు.

"పెద్ద పోతు పాతిగానివి లేవోయ్!" తిరిపేలు అన్నాడు.

కొంతసేపటికి మళ్లీ మొదలయ్యాయి చెతుర్లూ, నవ్వులాటలూ, పాటలూ కథలూ వగైరా... వగైరా...

పోను పోను అడవి దట్టమైంది వెదురు గుములతో, ఎండిన గడ్డితో భయం గొలుపుతూ వుంది. అక్కడక్కడా పాతకాలపు నాటి ఆవులదొడ్ల తాలూకు బడువులు కన్పిస్తున్నాయి.

అడవి అంటే – కుందేళ్లు, జింకలు, కడితులు, దుప్పల్లాంటి రకరకాల జంతువులకు ఆలవాలంగా వుంటుందనీ, అవి కళ్లముందు కన్పిస్తూ పారిపోతుంటా యనీ వినివున్నాడు సెవ్వన్న. ఇప్పటిదాకా ఒక్క జంతువు కూడా కన్పించకపోవటం అతనికి ఆశ్చర్యం కలిగించింది.

ఆ విషయాన్ని గురించే గురప్పను ప్రశ్నించాడు.

"ఓరె ఎర్రోడా! ఆ సన్నజీవాలన్నీ యాడుండాయిరా?" అన్నాడు బాధ ధ్వనించే గొంతుకతో. "మనిషి దెబ్బకు అవెప్పుడో నీలిగి సచ్చినయి.." అంటూ జంతువుల పతనావస్థను దృశ్యాలు దృశ్యాలుగా వివరించసాగాడు.

గుండ్రాళ్లను బోనులాగా అమర్చి కుందేళ్లను పట్టటం మొదలుకొని, చార్జింగ్ లైటు తలకు కట్టుకొని ఒక్క రాత్రికే పదులకొద్దీ కుందేళ్లూ, జింకలను వేటాడ్డం వరకు చెప్పుకొచ్చాడు. దుప్పుల్ని, కడితుల్ని, కొండగొర్రెల్ని మాటువేసి చంపటం, వేటకుక్కల సాయంతో అడవి పందుల్ని మట్టు బెట్టటం, నెమళ్లను నామరూపాలు లేకుండా చేయటం.. నోరులేని మూగజీవాలమీద మనిషి పైశాచికత్వాన్ని స్పష్టంగా వివరించాడు.

సెవ్వన్నకయితే తల తిరిగిపోయింది.

రాకాశుల్లాంటి మనుషుల మీద కోపం కూడా వచ్చింది.

"నేనే రేంజరునయితేనా - చెట్ల నరికేటోల్లనూ, జీవాల సంపేటోల్లనూ టుపాకితో ధామ్మున కాల్చిపారేఝను.." అన్నాడు ఆవేశంగా.

"అబ్బబ్బో...బో వీరుడురా వీడు.." ఎగతాలి చేశాడు పెరుగు సుబ్బన్న.

దారికి అటు ఇటు నిల్చున్న చెట్లు వాళ్లమీద పండుటాకుల్ని జలజల రాలుస్తున్నాయి.

కాళ్లకింద నలుగుతోన్న ఎండుటాకులు నడకకు తాళం వేస్తున్నాయి.

చెట్ల మొదళ్ల సందుల్లోంచి - నరికి పడేసిన వృక్ష కళేబరాల దృశ్యాలు చూపుల్ని లాక్కొంటున్నాయి. మొదలు వద్ద చేవనున్న మూరెడు తునక కోసం విచక్షణా రహితంగా కొట్టి పడేసిన చందనపు వృక్షాలతో, మిద్దె దంతెలు దూలాల కోసం ఎన్నో చెట్లను నరికి అందులో ఉత్తమంగా ఉన్నదాన్ని ఎన్నుకొని వదిలేసి పోయిన మిగిలిన వృక్షాలతో అడవంతా దయనీయంగా వుంది.

ఒక విత్తనం మొలకై, మానై, చేవదేరేసరికి ఎన్ని సంవత్సరాలు పడుతుందనీ! దాన్ని నరకటానికి పట్టే సమయం ఎంతసేపనీ!

సెవ్వన్న ఆలోచనల్నిండా అవే దృశ్యాలు, అవే ఆవేదనలు.

చెలిమ బావి దాటి 'జ్యోతి' ప్రాంతానికి వచ్చేసరికి మిట్టమధ్యాహ్నామైంది.

చుట్టూ కోటగోడల్లా కొండలు, మధ్యన మహా వృక్షాలతో కూడికొన్న విశాలప్రాంతం, వీటన్నిటికీ నడిబొడ్డుగా పెద్ద వూడలమర్రి, పక్కనే అటవీశాఖ. తవ్వించిన బావి, దాని పక్కగా నీటిగుండం, వూడల్ని పట్టుకొని వేలాడుతూవున్న కోతుల మందతో ఆ ప్రాంతం రమణీయంగా వుంది.

జ్యోతి నరసింహస్వామి గుడిపక్కనే కాశినాయన ఆశ్రమం.

ప్రస్తుతానికి నాయన ఇక్కడ లేడుట. కర్నూలు జిల్లాలో ఎక్కడో ఉన్నాడుట.

బోదకొట్టం ముందు ఉసిరిక చెట్టుకింద కూచుని కొంతమంది సన్యాసులు గంజాయి దమ్ము లాగుతున్నారు. ఒకరి తర్వాత మరొకరు గంజాయి చిలుంను అందుకొని నోటితో బలంగా పీలుస్తున్నారు.

ఎదురుగా పూతలు పిందెలతో పాతకాలం నాటి మామిడిచెట్టు. దాని కొమ్మకు అడుగు భాగాన కరచుకొని అందంగా అటు ఇటు కదలుతూ వుంది ఎర్రని బిట్టుడత ఒకటి. అక్కడక్కడా కొమ్మలకు వేలాడుతూ వున్న కొండ తేనె పెరలు మేకపోతు దట్టేల్లా వున్నాయి.

"ఇంగా ఎంత దూరముంది పెదనాయినా ఓబులం?" సెవ్వన్న అడిగాడు ఉస్సురుమని ఓ రాతిమీద కూచుంటూ.

"అప్పుడే ఏమైందిరా నాయాలా! ఇంత మూడంతలు నడ్సాల" కాశన్న చెప్పాడు.

"అమ్మో--"

"వీని పనయిపోయింది." రామయ్య చేతులు తిప్పటంతో అందరూ నవ్వారు.

"కొండల్లో యాడా నీల్లు దొరకవు. యాన్నే బువ్వ జేసికొని తిని సల్లబడే దాకా వుండిపోదాం." గురప్ప చెప్పటంతో మూటాముల్లె దించారు.

వంట ప్రయత్నాలు మొదలు పెట్టారు.

ఆకాశమెత్తు పెరిగిన బూరుగ వృక్షాలు, ముసలి మామిడి చెట్లు, పురాతనమైన గుడి, వాగు మధ్యగా నీటిగుండంతో అందంగా వున్న ఆ ప్రాంతాన్ని తనివిదీరా చూస్తోన్న సెవ్వన్నకు - దూరంగా కొండ శిఖరాల మీదుగా మెడలో హారంలాగా వంగి ఎగబాకుతూ వున్న పొగలతో కూడిన మంటధార కన్పించటంతో నొసలు ముడేశాడు. చెట్టు మొదలుకు ఆనుకు కూచున్న గురప్పను అడిగాడు దాన్ని గురించి.

తలెత్తి అటుకేసి చూడను కూడా లేదు ముసలాయన.

"కొండ పొలగాళ్లు అగ్గి పెట్టుంటారు.." చెప్పాడు.

"ఎందుకూ?"

"గడ్డి గాదం పరిక్కంపా చీకూ దట్టంగా వుంటది. మనిషి దూరను సందుకూడా వుండదు. గడ్డి ఎండింది గదా! అగ్గి బెడితే అంతా కాలిపోతది. పెద్ద చెట్లు మాత్రం మిగుల్తాయి. నరికి మోసేందుకు బాగుంటది గదా.."

సెవ్వన్న వినలేకపోయాడు.

ఎన్ని పక్షులు ఎన్ని జంతువులు, ఎన్ని విత్తనాలు, ఎన్ని లేతచెట్లు మంటబారినబడి మాడిపోతాయో గదా!

"అగ్గి బెట్టినోళ్లను కాళ్లు సేతులు కట్టేసి ఆ మంటల్లో యిసిరెయ్యాల." ఆక్రోశం పట్టలేకపోయాడు.

అతనికేసి తదేకంగా చూశాడు గురప్ప.

"కారెం దంచరా సిన్నబ్బీ!"

"యీ మెతుకుల్లేకి సియ్యలైతే బాగుండు. అడివిలో నడిసి నడ్సి నోరు సవ్వబడింది."

"యాందిరోయ్! అట్టనుకొన్నోనివి ఒక కోన్ని సంకనబెట్టక రాగూడదా?"

"ష్.. రాంరాం.. ఎండలు సంపుతుండాయి.." చిలుం చేయి మారింది.

నీళ్ల పక్కన నీడలో కూకొని గూడా మనమింత బాధపడ్తాండమే - అడివిలో నీళ్లు దొరక్క ఎన్ని మూగజీవాలు పానాలిడుస్తండాయో.. భగవాన్.."

"మనమిక్కడ ఉండడం కూడా పాపమే. అడవి జీవాలన్నీ యీ గుండంలోనే దప్పిక దీర్చుకోవాలి.. వాటిని ఇక్కడకు రాకుండా మనం అడ్డుకున్నట్లే.. రాం రాం.." గట్టిగా దమ్ములాగి పక్కవాడికి అందించాడు.

"ఫటక్.. ఫటక్.. ఫట్.. ఫట్.."

హఠాత్తుగా కొండదడి మీదుగా ఏదో శబ్దం.

"పెదనాయినా! యేందా సప్పుడు?"

"ఫట్.. ఫట్.. ఫటా.. ఫట్.."

రాతిని రాతికేసి వచ్చే శబ్దం లాంటిదే.

"ఏవూరు నాయినా మీది?" అడిగాడొక సాధువు.

"మాదే.. చిలకలపాడులే సామీ!"

"ఫట్.. ఫట్.. ఫట్.. ఫట్.. ట్.."

"ఓ బుళం పోతున్నారా నాయినా?"

"పెదనాయినా! యాందో వస్సాంది.." గట్టిగా అరిచాడు సెవ్వన్న.

"అవ్ రా.."

మాట ముగించలేదు గురప్ప.

అటుకేసి సరిగ్గా తలతిప్పి కూడా చూడలేదు.

క్షణాలు కూడా జరగలేదు.

రాళ్లను కాళ్లతో గాల్లోకి తంతూ మహావేగంతో, వింటినుండి వెలువడ్డ బాణంలా కొండపైన్నించి దిగి వచ్చిందాక కడితి అయాసంతో వగిరిస్తూ వుంది.

"కడ్తి.. కడితి.. కడ్తిరోయ్.." ఉద్విగ్నంగా అరుస్తూ లేచారు చాలామంది. చుట్టూ వున్న మనుషుల్ని లెక్కజేయలేదు అది.

గబగబ రెండంగల్లో నీళ్లమడుగు చేరుకొంది.

తలొంచి జరజర కడివెడు నీళ్లను తాగింది.

తర్వాత తలెత్తి చూసింది అందరికేసి బిక్కిరి బిక్కిరిగా.

వెనక్కి ముందుకూ వూగుతోంది. వగిరిస్తోంది.

ఈలోపే జనంలో చలనం వచ్చింది.

"కొట్టంండ్రా దాన్ని.."

"నరకండ్రా.."

"పోనీ గాకండ్రా..."

ఒక్కసారిగా కొండలు మార్మోగేలా అరిచారు.

అప్పటికే గురప్ప లేచి నిల్చున్నాడు.

జరగబోయే సంఘటన అర్థమైంది.

"ఒరేయ్. వొద్దురా!.. కొట్టగాకండ్రా.. దప్పికయి వొచ్చిందిరా.. ఒరే.." ముసలాయన మాటకన్నా ముందే రివ్వుమంటూ గాల్లో దూసుకెళ్లింది గొడ్డలి "పాపంరా నాకొడకల్లారా!"

మరో రెండు కర్రలు గాల్లోకి లేచాయి.

గొడ్డలి కడితిని తగల్లేదుగాని కిందపడి పెద్ద శబ్దం చేయటంతో ఒక్కసారిగా ఎగిరింది ఆ జీవం.

బోడు మీదుగా సుడిగాలిలా దూసుకు పోయింది.

"మనుసులున్నా లెక్కజెయ్యకుండా వొచ్చి నీల్లుదాగిందంటే.. అదెంత దప్పిగోనిందో సూడండ్రా పాపం.."

ముసలాయన మాట ముగించలేదు.

అప్పటికి వందగజాల దూరం కూడా వెళ్లలేదు కడితి.

హఠాత్తుగా విరుచుకు పడింది.

మొదలు నరికిన మానులా నేలబడింది.

ఆశ్చర్యంతో నిశ్చేష్టులైనారు అందరూ.

గజగజ తన్నుకోసాగింది కడితి.

"కడితి పడింది రోయ్.. రాండ్రోయ్.." కేకేస్తూ ముందుకు దూసుకుపోయాడు ఒకడు.

'కో' అని అరుస్తూ వెనకే పరుగుతీశారు అందరూ.

"ఒరే ఒరే" అంటోన్నా ఆగకుండా సెవ్వన్న కూడా ముందుకు పరుగెట్టాడు. కిందపడి తన్నుకొంటోన్న కడితిమీద దబాగుబా పడ్డాయి బడితెలు గొడ్డల్లు. చచ్చిందని తీర్మానించుకొన్న తర్వాత అందరూ దాన్ని నీళ్ల గుండం వద్దకు యీడ్చుకొచ్చారు.

ఏమీ చేయలేని నిస్సహాయత ఒళ్లంతా కమ్ముకోగా చెట్టుకు అనుకొని కూచుని ఎటో చూస్తుండిపోయాడు గురప్ప.

"పెదనాయినా! కడితిని సంపి తెచ్చినం.." ఆనందంగా చెప్పాడు సెవ్వన్న.

"నోర్ముయ్యి ఎదవనాకొడకా!" కసరుకొన్నాడు గురప్ప. "దప్పికై వొచ్చిందాన్ని సంపిన్రురా మీరు. ఆ పాపం మిమ్మల్ని వూరికే పోనియ్యదు. పురుగులు బడి సస్పరు నాకొడకల్లారా!" ఉక్రోషంగా అన్నాడు.

సన్యాసులు కూడా శాపనార్థాలు పెడుతున్నారు.

"ఎన్ని రోజుల్నించి దప్పిగొనిందో పాపం!.. మనుసులున్నా ప్రాణాలకు తెగించి వొచ్చి కడుపునిండా నీల్లు తాగేసరికి తట్టుకోలేకపోయింది. సేదదీర్చుకోనిచ్చుంటే బతికేది. వెధవలు తరిమి చంపారు.." బాధగా అంటున్నాడు ఓ సాధువు.

"సంపిందాన్ని తింటే పాపం లేదంటగా పెదనాయినా?"

సెవ్వన్న నమ్మిన ధర్మసూత్రానికి బాధతో కూడిన నవ్వొచ్చింది గురప్పకు.

"అవ్‌రా! సిన్నప్పుడు పిల్లిని సంపి ఆ పాపం పోగొట్టుకోడానికి దాని చెవి కాల్చుకొని తిన్నెదాన్నె గదూ నీకు సెవ్వన్న అనే పేరొచ్చింది.." అన్నాడు.

"ఈ అడివిని నరికే వాల్లూ. కొండకు నిప్పు పెట్టేవాల్లూ.. నీ యట్లనే ప్రపంచ గ్యానం లేకుండా వాల్లు జేసే పనికి గుడ్డి సంజాయిషీలు సెప్పుకొని సరిపెట్టుకోబట్టే లోకం యిట్లయింది." బాధగా అన్నాడు.

"కాలు బెనికింది. ఎట్టనడ్సాలబ్బా?"

"కడితి దొరికిన్లే! దాని మూలగదీసి రుద్దుదాం. దెబ్బకు నొప్పి మాయం.."

సంతోషంగా మాట్లాడుకొంటూ కడితిని కోయటంలో నిమగ్నమైనారు వాళ్లు.

● ఆంధ్ర సచిత్ర వారపత్రికలో - 6-12 ఫిబ్రవరి, 1987 ●